
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 18 నవంబరు 2025 | 5

రేపు అన్నదాత సుఖీభవ

1,14,991 మంది రైతులకు రూ.77 కోట్లు



రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్నదాతలకు శుభవార్త. అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద బుధవారం జిల్లాలోని 1,14,991 మంది రైతుల ఖాతాల్లో రూ.77 కోట్లు జమవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద రూ. 19.5 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.57.5 కోట్లు జమవుతాయన్నారు.జిల్లాలో అనపర్తి నియోజకవర్గంలో 17,595 మంది రైతులకు రూ.11.84 కోట్లు,రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 5730 మంది రైతులకు రూ.3.92 కోట్లు జమవుతాయని చెప్పారు.రాజమహేంద్రవరంఅర్బన్ నియోజకవర్గంలో ఒక లక్షా 48 వేలు,రాజానగరం నియోజకవర్గంలో 26,227 మంది రైతులకు రూ.17.58 కోట్లు, గోకవరం మండలంలో 7705 మంది రైతులకు రూ.4.94 కోట్లు జమవుతాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 23,482 మంది రైతులకు రూ.15.75 కోట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో 14,884 మంది రైతులకు రూ.9.98 కోట్లు, నిడదవోలు నియోజకవర్గం లో 19,368 మంది రైతులకు రూ.12.94 కోట్లు జమచేస్తారన్నారు.

ఇద్దరు పిల్లలు సహా.. తండ్రి అదృశ్యం

7

హర హర మహాదేవ





పుష్కరఘాట్ వద్ద సోమవారం తెల్లవారుజామున భక్తజనం

రాజమహేంద్రవరం సిటీ/నిడదవోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో జిల్లా అంతటా దేవదేవుడి ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి.తెల్లవారుజామున 2గంటలకే రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్, గౌతమిఘాట్,సరస్వతి ఘాట్, ధవళేశ్వరం రామపాదాలరేవు, కొవ్వూరు గోష్పాద క్షేత్రాలకు చేరుకుని భక్తులు పుణ్యస్నానాలు చేశారు. దీపదానాలు, సాలిగ్రామ దానాలు, స్వయం పాక దానాలు చేశారు. అరటి డొప్పలు, కొబ్బరి చిప్పలు, ఉసిరి కాయలు, నిమ్మడొప్పల్లో కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో విడిచి పెట్టారు.అనంతరం మహాశివాలయాలకు చేరుకుని మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు చేసి 365 ఒత్తులను వెలిగించారు.నిడదవోలు మండలం కాటకూటేశ్వరంలో ఉమా కాట కూటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

పులుగురుతేగా!





విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో రెండు రోజులూ మంత్రి లోకేశ్ షర్ట్‌పై చేనేత జాకెట్లు ధరించారు. తాను ధరించిన చేనేత జాకెట్ వివరాలను శనివారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఈ జాకెట్ మిలన్ లేదా ముంబైలో తయారైంది కాదు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పులగుర్త అనే చిన్న గ్రామంలో తయారు చేసింది' అని లోకేశ్ పేర్కొన్నారు. దీంతో పులగుర్త గ్రామంవైపు అందరి చూపు పడింది.. అసలు ఆ గ్రామంలో ఏం జరుగుతుందనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- ట్రెండ్‌కు అనుగుణంగా తయారీ
- పులుగుర్త వస్త్రాలకు డిమాండ్
- లోకేశ్ మదిని దోచిన వైనం
- విశాఖ సదస్సులో ప్రకటన

అనపర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ మగ్గం నుంచి ప్రముఖ మిల్లులకు ధీటుగా మనసు దోచే వస్త్రాలు నేస్తున్నారు.. తమకు డిమాండ్ సృష్టించుకుంటున్నా రు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులుగుర్తలో స్వాతంత్ర్యం రావడానికి నాలుగు నెలల ముందే చేనేత సొసైటీ ఏర్పాటు చేశారు. అనపర్తి మండలంలోని పులుగుర్త, కుతుకులూరు, రామవరం, పెడపర్తి గ్రామాల్లోనే కాకుండా రాయవరం మండలం సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో కూడా నేత కార్మికులు ఈ సొసైటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సుమారు మూడు మండలాల పరిధిలో 400 మంది నేతన్నల కుటుంబాలతో ముందుకు సాగుతుంది. ఒకప్పుడు పని లేని కాలం నుంచి ప్రస్తుతం చేతి నిండా పని దొరికే సొసైటీగా పులుగుర్త సొసైటీలోని కార్మికులు జీవనం సాగిస్తున్నారు. పులుగుర్త సొసైటీలో చీరల నుంచి దోవతీల వరకు సుమారు 80 రకాల వస్త్రాలను తయారు చేస్తూ దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో విక్రయాలు సాగిస్తున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ..

పులుగుర్త చేనేతలు అనేక రకాల చీరలు నేసినప్పటికీ వీరు తయారు చేసిన జకార్డు,జింధానీ,కుప్పడం,మల్కా చీరలకు గిరాకీ ఉం టుంది. పురుషులు ధరించే షర్టులకు గిరాకీ ఉంది. పంచెల నుండి కర్చీఫ్‌ల వరకు ఇక్కడి నేతన్నలు తయారు చేస్తారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 52 సొసైటీలు ఉన్నా పులుగుర్త సొసైటీ అగ్రగామిగా నిలవడమే కాకుండా వ్యాపారంలో కూడా తన సత్తా చాటుతోంది. సొసైటీ నుంచి ఆప్కో సంస్థ ఏడాదికి రూ.10 లక్షల వస్త్రాలు కొనుగోలు చేస్తుండగా ద్వారపూడిలోని పులుగుర్త బ్రాంచి ద్వారా ఏడాదికి రూ.45 లక్షల వస్త్రాలు విక్రయిస్తుంది. పులుగుర్తలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రం ద్వారా ఏడాదికి రూ.70 లక్షల వరకు విక్రయిస్తూ లాభాలను అర్జిస్తుంది.పులుగుర్త చేనేత సొసైటీ ఆరు సార్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులకు ఎంపిక కాగా ఒక పర్యాయం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బహుమతితో ప్రోత్సహించింది.

దూది నుంచి నూలు..

దూది నుంచి నూలు తయారు చేయడం వాటిని మగ్గం ఎక్కించే వరకు చేయాల్సిన పనులను పూర్తి చేసి నేతన్నలకు అప్పగిస్తుంది ఈ సొసైటీ. అలా తమ వద్దకు చేరిన నూలుతో సొసైటీ వారు అప్పగించిన డిజైన్లతో చీరలు నేసి తిరిగి సొసైటీకి అప్పగించడంతో నేతన్నల పని పూర్తవుతుంది. నేతన్నలకు అందించే సొగరులో 48 గజాల చీర తయారవుతుంది. వీటిని ఎనిమిది ఆరు గజాల చీరలుగా విడదీసి విక్రయిస్తారు. అయితే ఒక్కొక్క చీర నేత విలువను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. పులుగుర్త చేనేత సొసైటీ లాభాల బాటలో ఉండడంతో సభ్యులకు ప్రతి ఏడాది బోనస్‌తో పాటు డివిడెంట్లు అందించడంతో కార్మికుల కుటుంబాలకు ఊరట లభిస్తుంది.

ప్రభుత్వం ప్రోత్సహించాలి..



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే నేతన్నల జీవితాలు మరింత బాగుపడతాయి. పులుగుర్త చేనేత సొసైటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.కోటి వరకు బకాయిలు విడుదల చేస్తే కార్మికులకు చేయూతను అందించినట్లవుతుంది.

- పేరిశెట్టి లాలయ్య పులుగుర్త చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు





నేతన్నలు తయారుచేసిన షర్టులు

పులుగుర్తలో దూది నుంచి నూలు తీసే ఆధునిక యంత్రం

వద్దన్నా.. వినరే!



మళ్లీ యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- మళ్లీ విజృంభిస్తున్న వాడకం
- యథావిధిగా అమ్మకాలు
- దృష్టి సారించని కలెక్టర్, కమిషనర్
- షాపుల వద్ద మళ్లీ మామూలే
- అనారోగ్యమన్నా మారని తీరు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్‌పై ప్రభుత్వ యంత్రాంగం పట్టు వదిలేసింది. ఎందుకనో అలసత్వంలోకి జారుకొంది. గత కలెక్టర్ ప్రశాంతి మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్నప్పుడు, అంతకుముందు కేతన్‌గార్గ్ కమిషనర్‌గా పని చేసినప్పుడు ప్లాస్టిక్‌పై దాదాపుగా ఉక్కుపాదం మోపారు. కలెక్టర్ సైతం స్వయంగా తనిఖీలకు వెళ్లిన రోజులున్నాయి. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ఉన్న నిషేధాన్ని నాటి కలెక్టర్ పక్కాగా అమలు చేశారు. తరువాత మండలాలు, గ్రామాలకు విస్తరింపజేస్తామని చెప్పుకొచ్చారు. చిన్న దుకా ణాల నుంచి పెద్ద సముదాయాల వరకూ ఎక్కడా నిషేధిత ప్లాస్టిక్ కనబడకుండా ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్క రాజమహేం ద్రవరం కార్పొరేషన్ పరిధిలోనే రోజూ 100కిపైగా కేసులు రాసి జరిమానాలు వసూలు చేయడం జరిగేది.ఏడాదిలో ఏకంగా రూ.20 లక్షల వరకూ జరిమానాలు వసూలు చేశారు. అయితే ఆ ఉన్నతాధికారులు బదిలీపై వెళ్లడంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కి మళ్లీ రెక్కలొచ్చేశాయి. దుకాణదారులు జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు.

ప్లాస్టిక్‌ను మరిచారా?

కలెక్టర్‌గా కీర్తి చేకూరి, కార్పొరేషన్‌కి కమిషనర్‌గా రాహుల్ మీనా వచ్చారు. వాళ్లు వచ్చీ రావడంతోనే క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ ప్లాస్టిక్‌పై మాత్రం ఇప్పటి వరకూ దృష్టి సారించనట్టే కనబడుతోంది. దీంతో కిందిస్థాయి ఉద్యోగులు చతికిలపడ్డారు. కానీ జరిమానాల పేరుతో వసూళ్లు మాత్రం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాస్టిక్ నిషేధంపై యుద్ధం చేసే రోజుల్లో దుకాణదారులు పాలిథీన్ చేతి కవరు ఇవ్వడానికి తలపటాయించేవాళ్లు. కానీ ఇప్పుడు మళ్లీ పాత రోజులు వచ్చేశాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎక్కడపడితే అక్కడ కనబడుతోంది. రాజమహేంద్రవరం వెంకటేశ్వర మార్కెట్‌లో వందలాది దుకాణాలు ఉన్నాయి. ఈ మార్కెట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి రాదు. దీంతో కార్పొరేషన్ అధికారులు వెళ్లినప్పుడు అక్కడి వ్యాపారులు మీ పరిధి కాదంటూ ఎదురు తిరుగుతున్నారు. కమిషనర్‌గా కేతన్ గార్గ్ ఉన్న సమయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్లను వెంట బెట్టుకొని వెళ్లి సుమారు 5 టన్నుల నిషేధిక ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఇప్పుడు మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది.

జిల్లాలో రోజుకు 50 టన్నులు

తూర్పు గోదావరి జిల్లాలో రోజుకు సగటున 200 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతు న్నాయి. వాటిలో కనీసం 50టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్(ఒకసారి వాడి పారేసేవి), పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లు ఉంటున్నాయనే విషయం డ్రెయినేజీలు చూస్తే స్పష్టమవుతుంది. ఈ తరహా వాటిపై నిషేధం ఉంది. దీని అమలులో కొరవడిన చిత్తశుద్ధి ఉన్నతాధికారుల చొరవతో కొరడా ఝుళిపించింది. మళ్లీ ఇప్పుడు చల్లారిపోయింది. దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి. అసలు అవి విక్రయించే దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. ఆయా దుకాణాలపై అధికారులు దాడులు ఎందుకు చేయరనేది ప్రశ్నార్థకమే.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ముప్పే

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగిం చడం వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల రుగ్మతల బారిన పడతారని సర్వేలు చెవిలో పోరు పెడుతూనే ఉన్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వాసు చిత్రంలో ఫణీంద్ర, తవ్వా రాజా

రాజమహేంద్రవరంలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ

100 కోట్ల ప్రాజెక్టు : వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే తొలిసారిగా రాజమహేంద్రవరంలో రూ.100 కోట్లతో పైలట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జార్విస్ ఏవియేషన్ అకాడమి అధినేత ఫణీంద్ర ఆరుమిల్లి ప్రాజెక్టు వివరాలు తెలిపినప్పుడు వెంటనే ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు స్పందించి విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో జార్విస్‌తో ఒప్పందం చేసుకోగా రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఎఫ్‌టీవో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు.ఈ అకాడమీ ఏప్రిల్ నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతుందన్నారు. 40 మందితో మొదటి పైలెట్ బ్యాచ్ ప్రారంభమవు తుందన్నారు. కోన సీమ జిల్లా రాజోలుకు చెందిన ఫణీంద్ర మాట్లాడుతూ త్వరలో పైలెట్ శిక్షణకు విమానాలు వస్తున్నాయని చెప్పారు. శిక్షణకు 14 నెలలు పడుతుందన్నారు.



రూ.97 కోట్లు ఎవరివి?

- బ్యాంకుల్లో పేరుకున్న డబ్బు
- పదేళ్లుగా లావాదేవీల్లేవ్
- గుర్తించిన ఆర్‌బీఐ
- కలెక్టర్ కీర్తికి వివరాలు
- అవగాహనకు పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో క్లెయిమ్ కానీ నిధులు రూ.97 కోట్లు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మీ డబ్బు- మీ హక్కు అనే పేరుతో డిపాజిటర్ల విద్యా- జాగృతి నిధిపై సోమవారం ఆమె గోడప్రతికను ఆవిష్కరించి మాట్లాడారు. సుమారు 5.10 లక్షల వ్యక్తిగత ఖాతాలకు చెందిన సొమ్ము రూ.75 కోట్లు, 20 వేల పరిశ్రమల ఖాతాలకు చెందిన సొమ్ము రూ.18 కోట్లు, సుమారు 5 వేల ప్రభుత్వ ఖాతాలకు చెందిన సొమ్ము రూ.4 కోట్లు బ్యాంకుల్లో ఉందన్నారు. గత పదేళ్లగా దేశవ్యాప్తంగా పబ్లిక్ బ్యాంకుల్లో రూ.58,400 కోట్లు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.8,600 కోట్లు విలువైన మొత్తాలు అన్ క్లెయిమ్డ్ ఫండ్స్‌గా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లగా ఖాతాల్లో పేరుకుపోయిన డిపా జిట్లు (అన్ క్లెయిమ్డ్) తిరిగి లబ్ధిదారులకు అందజేయడానికి ఆర్‌బీఐ యుడీజీఎఎం పోర్టల్ వినియోగంపై అవగాహన పెంచుతున్నట్టు చెప్పారు. పోర్టల్ యూడీజీఏఎం ద్వారా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.అన్ క్లెయిమ్డ్. ఓఆర్‌జీలో తెలుసుకోవచ్చన్నారు. ఖాతాదారులు, నామినీలు, కుటుంబీకులు సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఆయా బ్యాంకుల నుంచి తమ సొమ్మును అర్హులు క్లెయిమ్ చేసుకోవచ్చని లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ.ప్రసాద్ తెలిపారు. ఖాతాదారు ఉంటే కేవైసీ పూర్తి చేసి ఖాతాను పునరుద్ధరించు కోవచ్చన్నారు.నామినీ ఉంటే గుర్తింపు పత్రాలు, మరణ ధ్రువీకరణ పత్రంతో క్లెయిమ్ చేసుకోవచ్చని తెలిపారు. వివాదాలు లేకపోతే కుటుంబీకులు సరైన పత్రాలతో పొందవచ్చని చెప్పారు. ఈ కార్య క్రమంలో జేసీ వై.మేఘా స్వరూప్, డీఆర్వో టి.సీతారామమూర్తి, సీపీవో ఎల్.అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఎం.ఆర్ ఆర్ ప్రేమ్‌కుమార్, భాగ్యలక్ష్మి, డీఎస్పీ భవ్యకిశోర్, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ఎస్ఎస్‌ఏ పీడీ ఎస్. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

30 వరకు పీఎంఏవై సర్వే

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై 2.0 పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించేందుకు జరుగుతున్న సర్వేను నవంబరు 30వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే అర్హులైన లబ్ధిదారులు తప్పనిసరిగా ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ కార్యాలయాలు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా పూర్తిచేసుకోవచ్చని తెలి పారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,429 మంది లబ్ధిదారుల నుంచి గృహ నిర్మాణాలకు అర్జీలు స్వీకరించామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సహాయ ఇంజనీర్లు అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గడువులోపు పూర్తి చేయాలని ఎంపీడీవో,హౌసింగ్, అధికారులకు సూచించారు. నివాస స్థల ధ్రువీకరణ పత్రం లేని లబ్ధిదారులకు తక్షణమే ధ్రువపత్రాలు జారీ చేయాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు.

లేడీవార్డెన్ వేధిస్తున్నారు.. రక్షణ కల్పించండి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఎస్సీ హాస్టల్ విద్యార్థుల వినతి



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ఎస్సీ కాలేజీ నెం.1 బాలుర హాస్టల్ విద్యార్థులు సోమవారం లేడీ వార్డెన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని, హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని, ఎస్సీ విద్యార్థులమైన తమకు సక్రమంగా భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరిని వేడుకున్నారు. కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో సోమవారం నాలుగు పేజీల వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని, మెనూ సక్రమంగా అందించాలని కోరినందుకు లేడీ వార్డెన్ తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, వ్యక్తిగత కక్షతో పోలీసు కేసులు పెడుతూ వేధిస్తున్నారని వాపోయారు. ఇప్పటికీ హాస్టల్‌లో మెనూ చార్టు లేదని, మెనూ అమలు కావడంలేదన్నారు. ఏఎస్‌డబ్ల్యువో, డీఎస్‌డబ్ల్యువోలు కూడా లేడీ వార్డెన్‌కు సపోర్టు చేయడంతో తమకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో కాకుండా ఆర్డీవోతో విచారణ జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కలెక్టర్‌ను అభ్యర్థించారు.

156 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో నిర్ణీత గడువులోగా సమస్యకు పరిష్కారం చూపించాలని. అర్జీలు పెండింగ్‌లో ఉంటే ప్రజల సంతృప్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 156 అర్జీలను స్వీకరించి మాట్లాడారు.అన్ని శాఖల పనితీరులో మార్పురావాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయిపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుంద న్నారు. కార్యక్రమంలో జేసీ మేఘా స్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి పాల్గొన్నారు.

రూమ్ బుక్ చేస్తే కమీషన్ వస్తుందని.. రూ.18 లక్షలకు టోకరా

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మీరు పెట్టిన డబ్బుకు డబుల్ వస్తుందంటే ఎవరికి మాత్రం ఆశ ఉండదు. అతను అలాగే ఆశపడ్డాడు.రూ.18 లక్షలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నాడు. రాజమహేంద్రవరానికి చెందిన ఫణికుమార్ ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతని ఇన్‌స్టాగ్రామ్‌కు ఒక లింక్ వచ్చింది.ఆ లింక్‌పై క్లిక్ చేస్తే యాప్ ఓపెన్ అవుతుందని..ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులోని హోటల్ రూమ్స్ బుక్ చేస్తే పెట్టిన డబ్బుకు డబుల్ వస్తుందని వాట్సప్ సందేశం వచ్చింది. తొలుత ఆ యాప్‌లో రూ.10 వేల రూమ్ బుక్ చేశాడు. అంతే వెంటనే అతని ఖాతాలో రూ.17 వేలు పడింది. రూ.20 వేలు రూమ్ బుక్ చేస్తే రూ. 40 వేలు పడింది. దీంతో ఫణికుమార్‌కు నమ్మకం కుదిరింది. అనంతరం రూ.లక్ష రూమ్ బుక్ చేయగా నగదు జమకాలేదు.రూమ్ బుక్ చేసుకుంటూ వెళితే ఒకేసారి సొమ్ము జమవుతుందని వాట్సప్ సందేశం అందింది. దీంతో రూ. 18 లక్షల వరకూ బుక్ చేశాడు.అయితే తిరిగి ఒక్క రూపాయి రాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు.దీంతో సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మురళీ కృష్ణ కేసు నమోదు చేశారు.

ఓం నమో శివ రుద్రాయ


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో దీపాలు వెలిగిస్తున్న మహిళ, చిన్నారులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు


కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో రుద్రాక్షల అలంకారంలో రామలింగేశ్వరస్వామి


కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి అభిషేకం




కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయలో దీప హారతి ఇస్తున్న మహిళలు


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో...


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో హారతి ఇస్తున్న శివమాలాధారులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో వీరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

కార్తీక మాసం చివరి సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ, శంభోశంకర అంటూ శివనామస్మరణ చేశారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరిలో దీపాలు వదిలారు. పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు


కలంతో నినదించారు..

- ఆయనవి అక్షరాయుధాలు
- సో.సు. మరణించినా రచనలు సజీవమే
- నేడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ జయంతి

(పిఠాపురం, ఆంధ్రజ్యోతి)


సోమసుందర్





సోమసుందర్ రచనల్లో కొన్ని..

'ఒక వీరుడు మరణిస్తే
వేలకొలదీ ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనే
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు!'

అంటూ తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో కలంతో నినదించిన 'వజ్రాయుధ' కవి సోమసుందర్ మన మధ్య లేకున్నా ఆయన కలం నుంచి వెలువడిన మాటల తూటాలు, అక్షరాయుధాలు నేటికీ అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తూ సజీవంగా నిలిచాయి. రచన, విమర్శ ఏదైనా పదునైన మాటలతో ఉంటుంది. సో.సు.గా అందరూ ముద్దుగా పిలుచుకునే కవులు, విమర్శకులు, రచయితలు, ప్రముఖులు ఆయన ప్రేమపూర్వక తిట్లనే దీవెనలుగా భావించేవారు. కవి, విమర్శకుడు, సమీక్షకుడు, అనువాదకుడు, కథా రచయిత, పత్రికా సంపాదకుడు అక్షర తపస్వి డాక్టర్ ఆవంత్స సోమసుందర్ 101వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

శంఖవరంలో పుట్టి పిఠాపురానికి..

1924 నవంబరు 18న కాకినాడ జిల్లా శంఖవరంలో కాశ్లూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు సోమసుందర్ జన్మించారు. 1929లో పిఠాపురంలోని పినతల్లి ఆవంత్స చిట్టి వెంకాయమ్మ, వెంకట్రావు దత్తత తీసుకొన్నారు. దీంతో ఇంటిపేరు కాశ్లూరి మారి ఆవంత్స సోమసుందర్ అయ్యారు. దత్తత తల్లి వెంకాయ్యమ్మకు సాహిత్యంపై ఉన్న ఆసక్తితో సోమసుందర్‌కు చిన్ననాటి నుంచి కృష్ణ శతకం కంఠతా పట్టించింది. శ్రీకృష్ణలీలలు, రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం వంటి చదివించడంతో సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. అదే 13వ ఏటనే కవిత్వ రచన చేసేలా ఉరికొల్పింది. ప్రాథమిక విద్య పిఠాపురంలోను, ఉన్నత విద్యను కాకినాడ పీఆర్ కళాశాలలోను చదివారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సోమసుందర్ చురుకుగా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టై తుని సబ్‌జైలులో శిక్ష అనుభవించారు. ఆ సమయంలోనే అభ్యుదయ కవిత్వంవైపు మళ్లారు. లాఠీచార్జిలో గాయపడిన ఈయన కలం నుంచి అక్షరాయుధాలు పుట్టుకొచ్చాయి. అక్కడే వజ్రాయుధానికి బీజంపడింది. 1944 నుంచి 48 వరకూ రాసిన కవితలను ఎంపికచేసి 1949 మార్చిలో వజ్రాయుధాన్ని ముద్రించారు. 1946 అక్టోబరు 26న దొడ్డి కొమరయ్య మరణంపై రాసిన కవితతో ఇది ప్రారంభమవుతుంది. తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా రచించిన 'వజ్రాయుధం' సంచలనమైంది. సమాజంలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతోందంటూ 1950 ఫిబ్రవరి 6న అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం వజ్రాయుధాన్ని నిషేధించింది. 1956లో నిషేధాన్ని ఎత్తివేశారు. దీనిని హిందీ, మరాఠీ భాషల్లో అనువదించారు. ఈ పుస్తకాన్ని ఆరుసార్లు ముద్రించారు. నేటి వరకు అది సోమసుందర్ రచనల్లో ప్రత్యేకంగా నిలిచింది.

చివరి రోజు వరకూ...

ఆరోగ్యరీత్యా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నా 2016 ఆగస్టు 12న మరణించే వరకూ సోమసుందర్ కలం ఆగలేదు. రచనలు వెలువడుతూనే ఉన్నాయి. 125కి పైగా గ్రంథాలు, కథానికలు రచించారు. వీటిల్లో గోదావరి జలప్రళయం, కాగళి, వెన్నెల్లో కోనసీమ, మా ఊరుమారింది, జీవనలిపి, ఆరుపర్ణి తదితరాలు ప్రాచుర్యం పొందాయి. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ సమయంలో రాసిన కాహళి, 1953లో గోదావరి నదికి వరదలు వచ్చిన సమయంలో రాసిన గోదావరి జలప్రళయం, వెన్నెల్లో కోనసీమ, మిణుగురులు, రక్తాక్షి, రాలిన ముత్యం, మా ఊరు మారింది, ఆంగ్లసీమలో ఆమని వీణలు, సోమసుందర్ కథలు, గురజాడ గురుత్వాకర్షణ, మేఘరంజని, విజ్ఞాన శాస్త్ర నేపథ్యంలో వెలువరించిన కవితా సంపుటి ఆ గతానికి శుభారంభం. సోషల్ రియలిజమ్ సిద్ధాంత సారాంశంతో కాలం వీలునామా, కర్నాటక, కేరళ, తమిళనాడుల్లోని యాత్రా స్థలాలు సందర్శించిన సమయంలో రాసిన అక్షయ తరంగిణి, పేదలు, అన్నార్తులు, బిచ్చగాళ్ల ఆక్రోశాలు, ఆకలిమంటలు ఇతివృత్తంగా అరిచే లోయలు, ఒక్క కొండలో వేయి శిల్పాలు, మతసామరస్యాన్ని చాటిచెబుతూ చేతవనీ, ధూపచాయ తదితర పుస్తకాలు, కవితా సంపుటిలు ప్రాచుర్యం పొందాయి. విమర్శనా గ్రంథాల్లో కృష్ణశాస్త్రి వెలిగించిన కార్తీక దీపాలు, జాతికి జ్ఞానేత్రం, కృష్ణశాస్త్రి కవితాత్మ, శేషేంద్రజాలం, గోపురదీపాలు, గురజాడ గురుత్వాకర్షణ, కాజీనజ్రుల్ ఇస్లామ్, కవితా కల్పవల్లి, ఉర్దూ సాహిత్యంలో ఉన్నత శిఖరాలు తదితర పుస్తకాలు, అనువాదంలో హెల్లీ జీవితం, సీకింగ్ మై బ్రోకెన్‌వింగ్ లాంటి గ్రంథాలు అనువదించారు. లేఖా సాహిత్యంలో, సంచారి దీపశిఖ కథా సంకలనం, సమాగమం నవలిక రచించారు. కలలు-కన్నీళ్లు పేరిట ఆత్మకథను రాసుకున్నారు. అనారోగ్యానికి గురైనా సహాయకుల సహకారంతో రచనలు కొనసాగించారు. అప్పటి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా శ్రీశ్రీతోపాటు పలువురు కవులపై రాసిన వ్యాసాలతో కూడిన 'శరచ్చంద్రిక' పుస్తకాన్ని రచించి బహుమతిగా అందజేశారు. మిత్రులతో కలిసి 1968-1975 మధ్య కళాకేళి పత్రికను నడిపి సంపాదకత్వం వహించారు. మరణించే వరకూ తన కలం ఆగని రీతిలోనే అందరి రచనలు చదివి అభినందించేవారు. ఈ లక్షణమే ఆయనను 2001లో సోమసుందర్ లిటరరీ ట్రస్టు ఏర్పాటువైపు నడిపించింది. తన తోటి సాహితీవేత్తలను ప్రోత్సహించాలనే ట్రస్టు ప్రారంభించి ఏటా పురస్కారాలు అందజేస్తూ వచ్చారు. తనకు లభించిన పురస్కారాల ద్వారా వచ్చిన నగదు, తన పేరున ఉన్న ఆస్తులను అమ్మి ఈ ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ప్రతిఏటా ఆయా రంగాల్లో ప్రముఖులకు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య పురస్కారం, రాజహంస కృష్ణశాస్త్రి పురస్కారం, రాంషా స్మారక విమర్శక పురస్కారం, గురజాడ కథాప్రభాస పురస్కారాలను పలువురు ప్రముఖులకు అందజేశారు.

అవార్డులు, పురస్కారాలు

సోమసుందర్ అందుకున్న అవార్డులు, పురస్కారాలు, సత్కారాలకు అంతేలేదు. 1979లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి, 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఆత్మగౌరవ పురస్కారం లభించింది. ఇదేగాక 2008లో ఎన్టీఆర్ జాతీయ స్మారక అవార్డు, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, రాజారామ్ సాహితీ పురస్కారం, కళారత్న పురస్కారం, లోక్‌నాయక్ పురస్కారం, గురజాడ 150వ జన్మదిన పురస్కారం, విశాలాంధ్ర విశిష్ట సత్కారం పొందగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్ పొందారు. సో.సు.గా అభిమానంగా పిలుచుకునే సోమసుందర్ అభిమానంగా తిట్లు తిడితే ఆయన అభిమానులు, స్నేహితులు, పరిచయస్తులు వాటిని దీవెనలుగా భావించేవారు. ఆ తిట్ల దీవెనలు లేకపోవడం లోటే అయినా ఆయన మాటలు తమ చెవుల్లో వినిపిస్తున్నట్టుగా ఉంటాయని వారు చెప్తున్నారు. ఎవరైనా రచన చేసి పుస్తకం పంపిస్తే దానిని చదివి వారికి అభిప్రాయం చెప్పడం ఆయన అలవాటు. సోమసుందర్ కోరిక మేరకు ఆయన పార్థివదేహాన్ని రంగరాయ వైద్య కళాశాలకు అందించారు.

నేడు సోమసుందర్ జయంతి

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆవంత్స సోమసుందర్ జయంతిని పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్టు సభ్యుడు మేకా మన్మధరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సభకు ప్రముఖ కథా రచయిత శ్రీకంఠస్ఫూర్తి హాజరవుతారు. సహృదయ మిత్ర మండలి సభ్యులు, కవులు, రచయితలు, పట్టణ ప్రముఖులు హాజరుకావాలని కోరారు.

నాకు దక్కే ప్రతి గౌరవం గిరిజనులకే...

- రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు వారికే అంకితం: 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ


నన్నయ వీసీ ప్రసన్నశ్రీని సన్మానిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది

దివాన్‌చెరువు,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తనకు దక్కే ప్రతిగౌరవం గిరిజనులకే చెందుతుందని, తనకు వచ్చిన ప్రతిష్ఠాత్మకమైన అవార్డును వారికే అంకితం చేస్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. కళా,సాంస్కృతిక విభాగంలో రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుని సోమవారం తిరిగివవచ్చారు.ఆమెకు రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద, విశ్వవిద్యాలయం చాళుక్య ద్వారం వద్ద అధ్యాపకులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అభినందన సభలో వీసీ మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులు అక్షరాస్యత కోసం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. ఈ అవార్డుతో 'నన్నయ'కు చక్కని గుర్తింపు వచ్చిందని, ఈ స్ఫూర్తితో విశ్వవిద్యాలయం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు అందుబాటులో ఉండాలి

- డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు గ్రామాల్లోని రైతులకు అందుబాటులోఉంటూ రుణాలు మంజూరు చేయాలని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని, రికవరీలకు అధ్యక్షులు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. కాకినాడ డీసీసీబీలో సహకార శిక్షణా సంస్థ (సీటీఐ), ఆప్కాబ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో జిల్లాలోని పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మనకిచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తే సొసైటీలను, డీసీసీబీని లాభాలబాటలో నడిపించవచ్చన్నారు. ఆప్కాబ్ ఫ్యాకల్టీ రమణారావు, సీటీఐ సత్యనారాయణరాజు... సహకార సంఘాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, అవగాహన ఎలా పెంచుకోవాలి, రైతులకు సహకార సంఘాల ద్వారా ఎలా మేలు చేయాలో వివరించారు. సహకార చట్టాలు, బైలాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

ర్యాలి కేశవస్వామికి ఐఏఎస్ అధికారి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి సోమవారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజనల్ డెవలెప్‌మెంట్ అథారిటీ కమిషనరు ఎన్.తేజభరత్ విచ్చేశారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆయనకు ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో





మంచు కురిసిందే మహబాగుందే..

ఇటీవల చలి పెరిగింది. దీంతో తెల్లవారుజామున పొగమంచు విపరీతంగా కురుస్తోంది. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట-గన్నవరం గ్రామాల మధ్యలో పంట పొలాలపై పొగమంచు దట్టంగా పట్టి మంచు తెరల సోయగం కనిపించింది. అందమైన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా.. - ఎటపాక (ఆంధ్రజ్యోతి)

తెలుగు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా సెమినార్



డిసెంబర్ 20లోపు నిర్వహిస్తాం

వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తెలుగు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా డిజిటల్ యుగంలో సామాజిక అభివృద్ధి తెలుగు భాష పాత్ర - సమస్యల పరిష్కారం అనే అంశంపై డిసెంబర్ 20లోపు సెమినార్ నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. డిసెంబర్ చివరి వారంలో 3 రోజుల పాటు కూచిపూడి నృత్యంపై ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 15 బృందాలకు చెందిన సుమారు 100 నుంచి 150 మంది కళాకారులు పాల్గొంటారన్నారు. జనవరిలో త్యాగరాజ సంగీత ఉత్సవాలు, ఫిబ్రవరిలో అన్నమయ్యపై సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హైదరబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయం 1985 డిసెంబర్ 2ను ఏర్పాటు చేయగా ఈ ఏడాది డిసెంబర్ 2కి 40 ఏళ్లు అవుతుందన్నారు. 40వ వార్షికోత్సవం రాజమహేంద్రవరంలోనే నిర్వహిస్తామన్నారు. క్యాంపస్‌లోని ప్రస్తుతం ఉన్న భవనాలకు మరమ్మతులు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు.

వివిధ కోర్సులకు 161 దరఖాస్తులు

ఈ విద్యాసంవత్సరం నిమిత్తం తెలుగు విశ్వ విద్యాలయం ఇచ్చిన నోటిఫికేషన్‌కు స్పందించి వివిధ కోర్సులకు 161 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. కూచిపూడిలో పలు కోర్సులకు 133 దరఖాస్తులు వచ్చాయి. వర్శిటీలో ఎంఏ డ్యాన్స్ యక్ష గానం, సర్టిఫికెట్ డిప్లమో, సాత్వికాభినయం వంటి కోర్సులు ఉన్నాయి. శ్రీశైలం పీఠంలో ఎంఏ హిస్టరీ, పీహెచ్‌డీ కోర్సులకు 25 దరఖాస్తులు వచ్చాయి. ఎంఏ తెలుగుకు మూడు దరఖాస్తులే వచ్చినట్టు వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు 20 వరకూ పొడిగించామని, అపరాధ రుసుం రూ.200తో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

వారి నియామకమెప్పుడు?

తెలుగువిశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్‌ను నియమించిన ప్రభుత్వం రిజిస్ట్రార్‌ను ఇంకా నియమించలేదు. ఫైనాన్స్ ఆఫీసర్‌ను నియమించలేదు. వారిద్దరి నియామకం పూర్తయితేనే ఇక్కడ పనులు, నియామకాలు వేగంగా జరుగుతాయి. బహుశా వచ్చేవారంలోపు వారి నియామకాలు ఉండవచ్చనే అంచనా ఉంది.

దుళ్ళలో దొంగతనం

- 20 గ్రాముల బంగారం, 5.530 కిలోల వెండి ఆభరణాలు మాయం
- వస్త్రాల మధ్య భద్రంగా ఉన్న 40 కాసుల బంగారు ఆభరణాలు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడియం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు ప్రవేశించి బంగారం, వెండి వస్తువులతో పాటు నగదును సైతం అపహరించుకుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుళ్ళ చెరువుగట్టు మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న ముసునూరి వెంకటరత్నం ఇంటిలో ఈ దొంగతనం జరిగింది. వారు ఈనెల 9న అమలాపురంలోని తమ రెండో కుమార్తె ఇంటికి వెళ్లారు. తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దొంగలు వాటిని బద్దలు గొట్టి ఇంటిలోకి ప్రవేశించి వస్తువులను దొంగిలించుకుపోయారు. ఇంటితాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని స్థానికులు అమలాపురంలో ఉన్న వెంకటరత్నంకు తెలిపారు. అతడు వచ్చి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 20 గ్రాముల 2 బంగారు ఉంగరాలతో పాటు 5 కిలోల 530 గ్రాముల వెండి, రూ.1,75,000 నగదు పోయినట్టు గుర్తించారు. మరో 40 కాసుల బంగారు ఆభరణాలు వస్త్రాల మధ్య ఉండటం వల్ల దొంగలకు చిక్కలేదు. దీంతో బాధితులకు కొంత ఉపసమనం కలిగింది. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డాగ్, క్లూస్‌టీమ్ తనిఖీలు నిర్వహించాయి. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి



రత్నగిరి రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- కార్తీకమాస చివరి సోమవారం 9167 వ్రతాలు
- రూ.85 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి చివరి కార్తీక సోమవారం భక్తులతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు రెండుగంటల నుంచి వ్రతాలు, దర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు పర్యవేక్షించారు. స్వామివారి వ్రతాలు, దర్శనానంతరం భక్తులు రత్నగిరి రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. చివరి సోమవారం సుమారు 9167 వ్రతాలు జరగగా, వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం లభించింది. ఇదిలాఉండగా సోమవారంతో ఈ ఏడాది కార్తీకమాస పర్వదినాలు ముగిశాయి. అయితే ఈ ఏడాది కార్తీకమాస రద్దీని దృష్టిలో పెట్టుకుని పర్యవేక్షణకు ముగ్గురు ప్రత్యేక అధికారులను దేవదాయ కమిషనర్ నియమించారు. ఆలయ చైర్మన్ రోహిత్ పర్వదినాల్లో రద్దీ నియంత్రణ, అడ్డదారుల్లో ఎవరూ వెళ్లకుండా పర్యవేక్షణ చేయడంతో పలువురి నుంచి ప్రశంసలు పొందారు.

సత్రంగదుల ధరల పెంపు

దేవదాయ కమిషనర్ ఆదేశాలు

డిసెంబరు 1 నుంచి అమలుచేసే ఆలోచనలో అధికారులు



అన్నవరం దేవస్థానంలో సీఆర్వో కార్యాలయం

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో సత్రంగదుల పెంపునకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. శానిటరీ నిర్వహణ ఖర్చులు పెరగడం, సత్రంగదుల రీమోడలైజేషన్, నూతనంగా దుప్పట్లు, దిండ్లు రగ్గులు కొనుగోలు చేయడం వంటి సౌకర్యాల కల్పనతో వ్యయం ఆధారంగా గదుల అద్దె పెంపు ప్రతిపాదనలకు దేవదాయ కమిషనర్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం పాత, కొత్త సెంటినరీ కాటేజీల ధర రూ.500 ఉండగా దానిని రూ.700కి పెంచారు. హరిహరసదన్ కాటేజీ అద్దె ప్రస్తుతం రూ.950 ఉండగా దానిని జీఎస్టీతో కలిపి రూ.1500కు పెంచారు. ప్రకాష్‌సదన్ కాటేజీ అద్దె ప్రస్తుతం రూ.999 ఉండగా దానిని రూ.1200 అద్దె 5 శాతం జీఎస్టీతో కలిపి వసూలు చేయనున్నారు. పెంచిన ధరలను డిసెంబరు 1 నుంచి అమలు చేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు.

వైద్యుడిపై దోపిడీ దొంగల దౌర్జన్యం

పోలీసుల రాకతో పరారీ

కాకినాడ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఓ వైద్యుడిపై దోపిడీ దొంగలు దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన డాక్టర్ రవి జైస్వాల్ కాకినాడ ఆర్ఎంసీలో ఈఎన్‌టి పీజీ మొదటి సంవత్సరం చదువుతూ స్థానిక సుబ్బయ్య హోటల్ సమీపంలో రూమ్‌లో అద్దెకు ఉంటున్నాడు. జీజీహెచ్‌లో ఆదివారం రాత్రి వైద్య సేవలందించి అర్ధరాత్రి 1 గంట సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా స్థానిక 3 లైట్ల జంక్షన్ వద్ద ముగ్గురు జైస్వాల్ వాహనాన్ని ఆపారు. ఐడీకార్డు చూపెట్టమన్నారు. చూపించిన వెంటనే వెళ్లిపోమన్నారు. మళ్లీ వెంబడించారు. రూమ్‌కు వస్తారని భయపడిన వైద్యుడు నేరుగా రైల్వేస్టేషన్ దారిలో వెళ్తుండగా వారు వాహనాలతో అడ్డగించారు. మళ్లీ ఐడీకార్డు చూపించమని అడగ్గా జైస్వాల్ ఐడీ కార్డు తీసేటప్పటికి లాగేసుకున్నారు. వైద్యుడి జేబులో రూ.2500 లాగేసుకున్నారు. వారిలో ఒక దొంగ వైద్యుడి వాహనంపై ఎక్కి 3లైట్ల జంక్షన్ వరకు తీసుకొచ్చి బండిని పార్క్ చేశారు. ఇద్దరు దొంగలు అక్కడ ఉండి, ఒక దొంగ వైద్యుడిని తన వాహనం ఎక్కించుకుని తన ఏటీఎం కార్డులో ఉన్న నగదును డ్రా చేయించేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఈలోపు జైస్వాల్ తన సహ వైద్యులకు తాను ప్రమాదంలో ఉన్నానని లొకేషన్ షేర్ చేశాడు. అనంతరం అపోలో హాస్పటల్ సమీపంలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు తీసుకెళ్లగా అప్పటికే సమాచారం అందు కున్న బీట్ కానిస్టేబుళ్లు తారసపడేసరికి ఆ దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులను తీసుకుని జైస్వాల్ తన వాహనం ఆపిన చోటుకు తీసుకెళ్లేసరికి అక్కడ ఉన్న ఇద్దరు దొంగలు కూడా పరారయ్యారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో మల్లేపల్లి సర్పంచ్ మృతి



బలిరెడ్డి వరలక్ష్మి (ఫైల్)

గండేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి (62) సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఆమెకు ఆదివారం గుండెపోటు రావడంతో రాజమండ్రి బొల్లినేని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. బలిరెడ్డి వరలక్ష్మి మల్లేపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండోసారి సేవలందించారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు విజయవంతంగా చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు పొందారు. వరలక్ష్మి భర్త గంగారాజు గతంలో గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ల పనిచేశారు. సర్పంచ్ వరలక్ష్మి మృతి పట్ల గ్రామస్తులు, అధికారులు, నాయకులు సంతాపం తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని క్రిస్టియన్‌పేట లూథరన్ చర్చి వెనుక నివాసం ఉంటున్న తుంపిరి రామారావు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బీరువాలో పెట్టిన రూ.3 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు చోరీ అయినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నెహ్రూనగర్ దుర్గగుడి ప్రాంతానికి చెందిన (ప్రస్తుతం కోరుకొండ బుచ్చంపేటలో నివాసం ఉంటున్న) కుందుర్తి శ్రీకాంత్‌ను సోమవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రామారావు ఇంటిలో దొంగతనం చేసిన (రూ.2.50 లక్షల విలువైన వస్తువులు) 1 బంగారపు నల్లపూసల తాడు, 3 బంగారపు ఉంగ రాలు, 4జతల వెండి పట్టీలు, 4 వెండి ఉంగరాలు, 2 వెండి బ్రాస్‌లెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గతంలో రాజమహేంద్రవరం త్రీటౌన్ ఏరియాలో 528/2025 చోరీ కేసుకు సంబంధించి బంగారపు తాడు, కడియం పోలీస్టేషన్ పరిధిలోని వేమగిరిలో 288/2025 కేసుకు సంబంధించి రూ.5,340 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కేసును ఛేధించిన సిబ్బందిని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎస్పీ జి.దేవకుమార్ అభినందించారు.

బాలికపై బాలుడు లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

కపిలేశ్వరపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరులో 11ఏళ్ల బాలుడు 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై సోమవారం అంగర పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

ఆటోను పడగొట్టిన అబోతు

తీవ్రగాయాలతో వ్యక్తి మృతి

అల్లవరం వద్ద ఘటన

అల్లవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో దేవాలయాలకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఆటోను అబోతు పడగొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత పడ్డాడు. వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన దంగేటి శ్రీనివాసరావుతో పాటు అతడి భార్య, చిన్న కుమార్తె, మరో ఇద్దరు ఆటోలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లోని అయినవిల్లి వినాయకాలయం, కుండలేశ్వరంలో పలు ఆలయాల దర్శనానికి వెళ్లారు. తర్వాత ఓడలరేవు బీచ్ చూసి తిరిగి వస్తుండగా అల్లవరం వద్ద ఓ బోతు రెచ్చిపోయి ఆటోను పడగొట్టింది. ఆటో పల్టీ కొట్టి అందులోని వారంతా పడిపోయారు. శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అల్లవరం సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందిస్తుండగా అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంపత్‌కుమార్ చెప్పారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరావు

9 జిల్లాలకు చెందిన సెర్ప్ సీఆర్పీలకు సామర్లకోటలో శిక్షణ తరగతులు



సామర్లకోటలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, రైతులకు మధ్య సెర్ప్ సీఆర్పీలు వ్యవసాయాభివృద్ధికి వారధిలా పనిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్ర ఆవరణలో శ్రీకాకుళం నుంచి తూర్పు గోదావరి వరకు తొమ్మిది జిల్లాలకు చెందిన సెర్ప్ సీఆర్పీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పీడీ శ్రీనివా సరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యుల్లో మంచి చురుకైన పనితీరు కలిగిన కొందరి మహిళలను ఎంపిక చేసి వ్యవసాయా ఉత్పత్తి దారుల సంఘాలతో సమన్వయం చేసుకోవడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి సీఆర్పీలు పాటుపడాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ఈ శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఇక్కడ సీఆర్పీలు పొందిన శిక్షణను క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను రాబట్టేందుకు రైతుల్లో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఈ శిక్షణలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నందున నూరుశాతం ఫలితాలను సమీకృత వ్యవసాయాభివృద్ధి ద్వారా సాధించాలని సూచించారు. ఇక్కడ శిక్షణ పొం దిన ప్రతీ ముగ్గురు సీఆర్పీలు గ్రామాల్లో 100 మంది రైతులను సమీకరించి అభివృద్ధి ఫలాలను వివరించాలని, కౌలు రైతులను భాగస్వాములను చేయాలన్నారు. తరగతుల ప్రారంభానికి ముందుగా పది జిల్లాల శిక్షణార్థులకు ఈటీసీ సౌజన్యంతో సమకూర్చిన స్టీల్ వాటర్‌బాటి ళ్లను పీడీ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ జీ.రమణ, డీడీవోలు డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్.శర్మ, డీపీఎం (ఎల్‌హెచ్) బాబూరావు, జేపీఈ వెంకటేశ్వరరావు, సామర్లకోట ఏపీఎం (ఎల్‌హెచ్) జగదీశ్వరి, అనిల్‌కుమార్ ఉన్నారు.

సోదరి ఇంటికి వెళ్తొస్తుండగా..

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ఆంజనేయులు (ఫైల్)


చాగల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ కే.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు మండలంలోని కలవలపల్లికి చెందిన ఇరగవరపు ఆంజనేయులు (23) బైక్‌పై తన సోదరి ఇంటికి విజ్జేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి సమయంలో నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెం శివారు కలవలపల్లికి వెళ్లే రోడ్డులో కల్యాణ మండపానికి సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆంజనేయులు తలకు బలమైనగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంతో నడిపి బైక్‌ను ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగించే ఆంజనేయులుకు వివాహం కాలేదు. అతడి సోదరుడు ఇరగవరపు సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కే.నరేంద్ర పేర్కొన్నారు.

ఏం జరిగిందో... ఏంటో?

- ఇద్దరు పిల్లలతో తండ్రి అదృశ్యం
- దిండి - చించినాడ వంతెనపై వస్తువులు
- గోదారిలో దూకారేమోనని అనుమానాలు
- ఆందోళనలో కుటుంబసభ్యులు



అదృశ్యమైన మోహిత్, జాహ్నవి (ఫైల్)





దిండి-చించినాడ వంతెన బైక్, ముగ్గురు విడిచిన చెప్పులు

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (38) తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యాడు. భార్యతో ఉన్న విభేదాలతో దుర్గాప్రసాద్ తన కుమారుడు మోహిత్ (14), కుమార్తె జాహ్నవి(9)లను వెంటపెట్టుకుని గ్లామర్ బైక్‌పై సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. దిండి- చించినాడ వంతెనపై బైక్, జోళ్లు, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డులను వదిలాడు. వారు గోదావరిలోకి దూకి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వంతెనపై వదిలిన వస్తువులను స్థానికులు చూసి బంధువులకు సమాచారం ఇవ్వడంతో దిండి - చించినాడ వంతెన వద్దకు గ్రామస్తులు, కుటుంబసభ్యులు వెళ్లారు. అయితే వంతెన యలమంచిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో అక్కడ ఫిర్యాదు చేశారు. మలికిపురం, యలమంచిలి పోలీసులు సీసీ కెమెరాల ద్వారా పశ్చిమగోదావరి జిల్లా వైపు ఎవరైనా వెళ్లారా అని ఆరా తీస్తున్నారు. దుర్గాప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడని స్థానికులు తెలిపారు. తండ్రి, ఇద్దరు పిల్లలు అదృశ్యం కావడంతో ఎక్కడున్నారో.. వారికి ఏం జరిగిందో తెలియక కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

పెరిగిన చలి తీవ్రత



రాజమహేంద్రవరం తెల్లవారుజామున మంచుతెర

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరిగింది. మూడురోజులుగా చలి విపరీతంగా పెరిగింది. తెల్లవారుజామున అరటి, బెండ, దొంగ తదితర కూరగాయలు రవాణా చేసే రైతులు, టిఫిన్, టీ, ఇతర వ్యాపారాలు చేసుకునేవారు. నైట్ డ్యూటీలు చేసే ఉద్యోగులు, కార్మికులు చలితో ఇబ్బందులు పడుతున్నారు. స్వెటర్లు ధరించి పనులు చేసుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు 17 నుంచి 22 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. తెల్లవారు జాము మొదలుకొని ఉదయం 9గంటల వరకు చలి తీవ్రత ఉంటోంది, ఎండ పెరిగేకొద్దీ సాయంత్రం 4గంటల వరకు కాస్త ఊరటగా ఉన్నప్పటికీ ఆ తర్వాత నుంచే చలి ప్రారంభమై రాత్రికి తీవ్రత పెరిగిపోతుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. స్వెటర్లు ధరిస్తున్నారు. ఉదయం అక్కడక్కడ చలి మంటలు వేసుకుంటున్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జరగబోయే రాజమండ్రి డివిజన్ 28వ మహాసభలో ఎల్ఐసీ క్లాస్ 3,4 ఉద్యోగులు 350 మంది పాల్గొంటున్నారని ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను రాజమండ్రి డివిజనల్ ఆఫీసులో విరామ సమయంలో ఆవిష్కరించారన్నారు. సభలో ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను చర్చిస్తామని చెప్పారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత ద్వారా ప్రశాంతత లభిస్తుందని, అందుకు ప్రతీ ఒక్కరు కొంత సమయం కేటాయించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. మాధవరాయుడుపాలెంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సర్పంచ్ అన్నందేవుల చంటి, విజయ దంపతులు, కుమారుడు రాజీవ్‌కృష్ణ స్వామి వారికి సిందూర, తమలపాకులతో పూజలు చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.ఆయనను చంటి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం జరిపారు. అనంతరం గ్రామంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, జనసేన, టీడీపీ మండలాధ్యక్షులు ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, సర్పంచ్ చెక్కపల్లి మురళి, డా. వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వట్టికూటి దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఆర్టీసీ బస్సుల్లో శబరిమలకు అయ్యప్పస్వాములు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డిపో నుంచి ఐదు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు సోమవారం అయ్యప్ప భక్తులతో శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లాయని డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఈ మేరకు శబరిమల వెళుతున్న బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ భక్తులు యాత్ర ముగించుకుని ఈనెల 23న తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటారన్నారు. శబరిమల యాత్రకు భక్తుల ఆదరణ పెరగడంతో దానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను సిద్ధం చేస్తున్నామన్నారు. భక్తులు కోరితే వారి ఊరి నుంచి యాత్రకు బస్సులు పంపిస్తామని వెల్లడించారు. డిపోలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

గోకవరం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి సంఘ సభ్యులు, సిబ్బంది కృషి చేయాలని గోకవరం సంఘ అధ్యక్షుడు గాజింగం సత్యనారాయణ(సత్తిబాబు) అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను సోమవారం స్థానిక సొసైటీ ఆవరణలో నిర్వహించారు. సహకార పతాకాన్ని సత్తిబాబు ఆవిష్కరించి ప్రసంగించారు. సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని సంఘాన్ని లాభాల బాటలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో రాందాస్ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ గండేపల్లి శ్రీనివాసరావు, సొసైటీ బ్యాంక్ డీజీఎం కార్తీక రెడ్డి, సొసైటీ సీఈవో డి.సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు' బుక్‌లెట్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన 'పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు' బుక్‌లెట్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.భీమయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజానీకానికి వైద్యాన్ని, వైద్యవిద్యను దూరం చేసే ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ ప్రదీప్, జిల్లా కోశాధికారి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓం నమః శివాయ!

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- కార్తీక సోమవారం పూజలు
- స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



బిక్కవోలులో గోలింగేశ్వరుడికి క్షీరాభిషేకం

బిక్కవోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో మండలంలోని శైవ క్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామికి క్షీరాభిషేకంతో పాటు పంచామృతాలతో అభిషేకాలు జరిపి లక్ష బిల్వార్చన నిర్వహించారు. పార్వతిదేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. కొంకుదురులోని త్రిముఖ లింగేశ్వరునికి, ఊలపల్లిలోని అగస్త్యేశ్వరస్వామికి లక్ష బిల్వార్చనలు జరిపారు. ఇల్లపల్లిలోని 108 స్తం భాల గుడిలోని పాదరస లింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: గాడాల శ్రీ మహలక్ష్మి సమేత చిన వెంకటేశ్వరస్వామి పీఠంలో కొలువుదీరిన శ్రీ వీరేశ్వరస్వామికి కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు లక్ష పంచముఖి రుద్రాక్షలతో విశేషార్చన ప్రారంభించారు. ఈ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముగుస్తుందని, ఈ పంచముఖి రుద్రాక్షలకు మహానదుల జలాలతో అభిషేకం చేయనున్నట్టు పీఠాధిపతి చినవెంకన్నబాబు స్వామిజీ తెలిపారు.

కోరుకొండ: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద కార్తీక దీపోత్సవంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారి పాదాల వద్ద పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా వారితో ఆలయార్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కొండపాదవునా వెలిగించే కార్తీక దీపోత్సవాన్ని బీవీఆర్ దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ తనకాల వెంకటరమణమ్మ, కంటే నాగకేశవరావు, తనకాల నాగేశ్వరరావు, మాతా సీతారాములు, కొయ్యా శామ్యూల్, దాశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో అనపర్తిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవ వైభవంగా జరిపారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊయలలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(దత్తుడు శ్రీను) దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి ఊయల సేవ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అనపర్తిలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఊయల సేవ

నేడు పారిశుధ్యంపై శిక్షణ

బిక్కవోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులకు పారిశుధ్యంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు ఎంపీడీ వో వి.శ్రీనివాస్ తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా వుంచడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తామన్నారు.

పోస్టల్ టీటీ చాంపియన్‌షిప్‌లో

ఉమేష్‌కు గోల్డ్‌మెడల్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన 40వ జాతీయ పోస్టల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రాజమహేంద్రవరానికి చెందిన ఆచంట ఉమేష్ టీమ్ విభాగంలో గోల్డుమెడల్ సాధించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల సర్కిళ్లకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, ఫైనల్‌లో తమిళనాడును ఓడించి గోల్డుమెడల్ దక్కించుకున్నారు. అలాగే పవన్‌తో కలసి ఉమేష్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఆచంట ఉమేష్ ఇప్పటి వరకూ 30కి పైగా జాతీయ క్రీడల్లో పాల్గొన్నాడు. జాతీయ పోస్టల్, జాతీయ సివిల్ సర్వీసెస్ పోటీల్లో మొత్తం 10 మెడల్స్ సాధించాడు.

జి.యర్రంపాలెం సీలింగ్ భూములను

పేదలకు పంచాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కూలీల ఆందోళన

రాజానగరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో జి.యర్రంపాలెం రెవెన్యూ పరిధిలోని సీలింగ్ భూములను భూమిలేని పేదలకు పంచాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)ఆధ్వర్యంలో సోమవారం రాజానగరంలో ప్రదర్శన చేసి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ జి.యర్రంపాలెం గ్రామంలో సర్వే నెంబరు 330/4లో ఉన్న 4.43 ఎకరాలు భూమిలో గతంలో గ్రావెల్ కొండ ఉండేదని, రాజకీయ బలంలో గ్రావెల్ తవ్వేసుకుని అమ్ముకున్నారన్నారు. ప్రస్తుతం సదరు భూమి ఖాళీగా ఉందని, దీనిని భూమిలేని పేదలకు పంపిణీ చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీజీఆర్ఎస్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- కోరుకొండలో ప్రజా దర్బార్
- 150 అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను శాఖల వారీగా అధికారులకు అందజేసి సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా కృషిచేస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆయన వివిధ శాఖల అధికారులతో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు 150 అర్జీలు అందజేశారు. ముఖ్యంగా విద్య, వైద్యం, భూమి హెచ్చుతగ్గులు, భూ వివాదాలు, సంక్షేమ పథకాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ఎన్ఆర్‌జీఎస్ పనుల్లో సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిలో కొన్నింటిని ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఏర్పాటైన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ఎక్కడిక్కడ పరిష్కరించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. కోరుకొండకు చెందిన ఒక బాలిక మిస్సింగ్ కేసును పరిష్కరించాలని పోలీసులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గుమ్ములూరులో వైసీపీ పాలనలో దొంగ పట్టాలు ఇచ్చారని,అర్హులకు కాకుండా భూములు, కార్డులు ఉన్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చారంటూ ఫిర్యాదులు అందాయని పేర్కొనారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుస్వాగతం, ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, ఏడీఏ శశిబిందు, జనసేన నాయకులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



పురాతన నాణాలను చూపిస్తున్న అల్లు రామకృష్ణ

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గౌతమీ గ్రంథాలయంలో అల్లు రామకృష్ణ ఆధ్వర్యంలో పురాతన నాణెములు, నోట్లు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ దేశాల కరెన్సీలు, పురాతన నాణాలు, గాంధీజీ వాడిన వాచీ వంటివి ఈ ప్రదర్శనలో ఉంచారు. గౌతమీ స్కూల్, ప్రభుత్వ హైస్కూల్, ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజి విద్యార్థులు సుమారు 300 మంది ఈ ప్రదర్శనను తిలకించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సీతంపేట గ్రంథాలయంలో కవితలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.భీమయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రంథాలయాధికారి డి.వెంకటరమణ, సిబ్బంది డి.రాజు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ అభిలాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు హెచ్ఎం కర్రి కళ్యాణి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి అంశంపై అవగాహన ఉండాలని, కొత్త అంశాలను నేర్చుకోవాలన్న కోరిక ప్రతి విద్యార్థిలోను ఉండాలన్నారు. గ్రంథాల యాల్లో పుస్తక పఠనం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనపర్తిలో వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పోటీలతో విద్యార్థుల

సర్వతోముఖాభివృద్ధి

జీజీయూ వీసీ చంద్రశేఖర్

దివాన్‌చెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పోటీలు దోహదపడతాయని జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధస్సు పట్ల పెరుగుతున్న ఆదరణ, దాని దుష్ప్రభావాలు అనే అంశంపై విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చంద్రశేఖర్ జ్ఞానసముపార్జనకు విద్యార్థులు అవలంబించవలసిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి చిట్టూరి విజయప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఏఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ విమలవైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరానికి

ఒక్క పరిశ్రమను తీసుకురాలేకపోయారు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు17(ఆంధ్రజ్యోతి): విశాఖలో సీఐఐ పెట్టుబడుల సదస్సు జరిగితే ఇందులో రాజమహేంద్రవరానికి ఒక్కపరిశ్రమను కూడా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీసుకురాలేకపోయారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ రూ.13 లక్షల కోట్లు విలువైన 613 వివిధ కంపెనీలు, పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల స్థాపనకు ఒప్పందం కుదుర్చుకున్నారని, అయితే ఎంపీ రాజమహేంద్రవరానికి ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. సీఎం, చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు స్వయాన బంధువైన ఎంపీ ఒక్క పరిశ్రమనూ తీసుకురాలేదని విమర్శించారు. సమావేశంలో బత్తిన చంద్రరావు, డాక్టర్ రాజశేఖర్, బర్రె సుబ్రహ్మణ్యం , కిషోర్ కుమార్ జైన్, దేయ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల న్యాయవాదులపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించి న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలనే డిమాండ్‌తో సోమవారం జిల్లా న్యాయవాదుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట న్యాయవాదులు ఆందోళన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిధి పీవీపీఎస్‌బీ రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల పోలీసులు, నేరస్తులు న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, గతంలో ఇచ్చిన 41ఏ చట్టాన్ని ఉపసంహరించాలని కోరారు. న్యాయవాదుల ఇతర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దూడల త్రినాధరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, సాదిక్ హుస్సేన్, ప్రవీణ్‌కుమార్, కొండేటి వరలక్ష్మి, రాజు, రూపా రాజేశ్వరి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 16 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో 16 అర్జీలు స్వీకరించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ 7, ఇంజనీరింగ్ విభాగానికి 3, వార్డు సచివాలయానికి 3, రెవెన్యూకు 2, పబ్లిక్ హెల్త్‌కు 1 అర్జీ వచ్చాయని తెలిపారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, డిప్యూటి సిటీ ప్లానర్ నాయుడు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మేనేజరు అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.



రేపు అన్నదాత సుఖీభవ

1,14,991 మంది రైతులకు రూ.77 కోట్లు



రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్నదాతలకు శుభవార్త. అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద బుధవారం జిల్లాలోని 1,14,991 మంది రైతుల ఖాతాల్లో రూ.77 కోట్లు జమవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద రూ. 19.5 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.57.5 కోట్లు జమవుతాయన్నారు.జిల్లాలో అనపర్తి నియోజకవర్గంలో 17,595 మంది రైతులకు రూ.11.84 కోట్లు,రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 5730 మంది రైతులకు రూ.3.92 కోట్లు జమవుతాయని చెప్పారు.రాజమహేంద్రవరంఅర్బన్ నియోజకవర్గంలో ఒక లక్షా 48 వేలు,రాజానగరం నియోజకవర్గంలో 26,227 మంది రైతులకు రూ.17.58 కోట్లు, గోకవరం మండలంలో 7705 మంది రైతులకు రూ.4.94 కోట్లు జమవుతాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 23,482 మంది రైతులకు రూ.15.75 కోట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో 14,884 మంది రైతులకు రూ.9.98 కోట్లు, నిడదవోలు నియోజకవర్గం లో 19,368 మంది రైతులకు రూ.12.94 కోట్లు జమచేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

8

హర హర మహాదేవ



పుష్కరఘాట్ వద్ద సోమవారం తెల్లవారుజామున భక్తజనం

రాజమహేంద్రవరం సిటీ/నిడదవోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో జిల్లా అంతటా దేవదేవుడి ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి.తెల్లవారుజామున 2గంటలకే రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పుష్కరాల రేవు, టీటీడీ ఘాట్, గౌతమిఘాట్,సరస్వతి ఘాట్, ధవళేశ్వరం రామపాదాలరేవు, కొవ్వూరు గోష్పాద క్షేత్రాలకు చేరుకుని భక్తులు పుణ్యస్నానాలు చేశారు. దీపదానాలు, సాలిగ్రామ దానాలు, స్వయం పాక దానాలు చేశారు. అరటి డొప్పలు, కొబ్బరి చిప్పలు, ఉసిరి కాయలు, నిమ్మడొప్పల్లో కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో విడిచి పెట్టారు.అనంతరం మహాశివాలయాలకు చేరుకుని మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు చేసి 365 ఒత్తులను వెలిగించారు.నిడదవోలు మండలం కాటకూటేశ్వరంలో ఉమా కాట కూటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

పులుగుర్తేగా!

విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో రెండు రోజులూ మంత్రి లోకేశ్ షర్ట్‌పై చేనేత జాకెట్లు ధరించారు. తాను ధరించిన చేనేత జాకెట్ వివరాలను శనివారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఈ జాకెట్ మిలన్ లేదా ముంబైలో తయారైంది కాదు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులగుర్త అనే చిన్నగ్రామంలో తయారు చేసింది' అని లోకేశ్ పేర్కొన్నారు. దీంతో పులగుర్త గ్రామంవైపు అందరి చూపు పడింది.. అసలు ఆ గ్రామంలో ఏం జరుగుతుందనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



- ట్రెండ్‌కు అనుగుణంగా తయారీ
- పులుగుర్త వస్త్రాలకు డిమాండ్
- లోకేశ్ మదిని దోచిన వైనం
- విశాఖ సదస్సులో ప్రకటన

అనపర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ మగ్గం నుంచి ప్రముఖ మిల్లులకు దీటుగా మనసు దోచే వస్త్రాలు నేస్తున్నారు.. తమకు డిమాండ్ సృష్టించుకుంటున్నా రు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులుగుర్తలో స్వాతంత్ర్యం రావడానికి నాలుగు నెలల ముందే చేనేత సొసైటీ ఏర్పాటు చేశారు. అనపర్తి మండలంలోని పులుగుర్త, కుతుకులూరు, రామవరం, పెదపర్తి గ్రామాల్లోనే కాకుండా రాయవరం మండలం సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో కూడా నేత కార్మికులు ఈ సొసైటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సుమారు మూడు మండలాల పరిధిలో 400 మంది నేతన్నల కుటుంబాలతో ముందుకు సాగుతుంది. ఒకప్పుడు పని లేని కాలం నుంచి ప్రస్తుతం చేతి నిండా పని దొరికే సొసైటీగా పులుగుర్త సొసైటీలోని కార్మికులు జీవనం సాగిస్తున్నారు. పులుగుర్త సొసైటీలో చీరల నుంచి దోవతీల వరకు సుమారు 80 రకాల వస్త్రాలను తయారు చేస్తూ దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో విక్రయాలు సాగిస్తున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ..

పులుగుర్త చేనేతలు అనేక రకాల చీరలు నేసినప్పటికీ వీరు తయారు చేసిన జకార్డు,జింధానీ,కుప్పడం,మల్కా చీరలకు గిరాకీ ఉం టుంది. పురుషులు ధరించే షర్టులకు గిరాకీ ఉంది. పంచెల నుండి కర్చీఫ్‌ల వరకు ఇక్కడి నేతన్నలు తయారు చేస్తారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 52 సొసైటీలు ఉన్నా పులుగుర్త సొసైటీ అగ్రగామిగా నిలవడమే కాకుండా వ్యాపారంలో కూడా తన సత్తా చాటుతోంది. సొసైటీ నుంచి ఆప్కో సంస్థ ఏడాదికి రూ.10 లక్షల వస్త్రాలు కొనుగోలు చేస్తుండగా ద్వారపూడిలోని పులుగుర్త బ్రాంచి ద్వారా ఏడాదికి రూ.45 లక్షల వస్త్రాలు విక్రయిస్తుంది. పులుగుర్తలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రం ద్వారా ఏడాదికి రూ.70 లక్షల వరకు విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తుంది.పులుగుర్త చేనేత సొసైటీ ఆరు సార్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులకు ఎంపిక కాగా ఒక పర్యాయం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బహుమతితో ప్రోత్సహించింది.

దూది నుంచి నూలు..

దూది నుంచి నూలు తయారు చేయడం వాటిని మగ్గం ఎక్కించే వరకు చేయాల్సిన పనులను పూర్తి చేసి నేతన్నలకు అప్పగిస్తుంది ఈ సొసైటీ. అలా తమ వద్దకు చేరిన నూలుతో సొసైటీ వారు అప్పగించిన డిజైన్లతో చీరలు నేసి తిరిగి సొసైటీకి అప్పగించడంతో నేతన్నల పని పూర్తవుతుంది. నేతన్నలకు అందించే సొగరులో 48 గజాల చీర తయారవుతుంది. వీటిని ఎనిమిది ఆరు గజాల చీరలుగా విడదీసి విక్రయిస్తారు. అయితే ఒక్కొక్క చీర నేత విలువను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. పులుగుర్త చేనేత సొసైటీ లాభాల బాటలో ఉండడంతో సభ్యులకు ప్రతి ఏడాది బోనస్‌తో పాటు డివిడెంట్లు అందించడంతో కార్మికుల కుటుంబాలకు ఊరట లభిస్తుంది.

ప్రభుత్వం ప్రోత్సహించాలి..



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే నేతన్నల జీవితాలు మరింత బాగుపడతాయి. పులుగుర్త చేనేత సొసైటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.కోటి వరకు బకాయిలు విడుదల చేస్తే కార్మికులకు చేయూతను అందించినట్లవుతుంది.
- పేరిశెట్టి లాలయ్య పులుగుర్త చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు





నేతన్నలు తయారుచేసిన షర్టులు

పులుగుర్తలో దూది నుంచి నూలు తీసే ఆధునిక యంత్రం

వద్దన్నా.. వినరే!



మళ్లీ యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- మళ్లీ విజృంభిస్తున్న వాడకం
- యథావిధిగా అమ్మకాలు
- దృష్టి సారించని కలెక్టర్, కమిషనర్
- షాపుల వద్ద మళ్లీ మామూలే
- అనారోగ్యమన్నా మారని తీరు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్‌పై ప్రభుత్వ యంత్రాంగం పట్టు వదిలేసింది. ఎందుకనో అలసత్వంలోకి జారుకొంది. గత కలెక్టర్ ప్రశాంతి మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్నప్పుడు, అంతకుముందు కేతన్‌గార్గ్ కమిషనర్‌గా పని చేసినప్పుడు ప్లాస్టిక్‌పై దాదాపుగా ఉక్కుపాదం మోపారు. కలెక్టర్ సైతం స్వయంగా తనిఖీలకు వెళ్లిన రోజులున్నాయి. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ఉన్న నిషేధాన్ని నాటి కలెక్టర్ పక్కాగా అమలు చేశారు. తరువాత మండలాలు, గ్రామాలకు విస్తరింపజేస్తామని చెప్పుకొచ్చారు. చిన్న దుకాణాల నుంచి పెద్ద సముదాయాల వరకూ ఎక్కడా నిషేధిత ప్లాస్టిక్ కనబడకుండా ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్క రాజమహేం ద్రవరం కార్పొరేషన్ పరిధిలోనే రోజూ 100కిపైగా కేసులు రాసి జరిమానాలు వసూలు చేయడం జరిగేది.ఏడాదిలో ఏకంగా రూ.20 లక్షల వరకూ జరిమానాలు వసూలు చేశారు. అయితే ఆ ఉన్నతాధికారులు బదిలీపై వెళ్లడంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కి మళ్లీ రెక్కలొచ్చేశాయి. దుకాణదారులు జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు.

ప్లాస్టిక్‌ను మరిచారా?

కలెక్టర్‌గా కీర్తి చేకూరి, కార్పొరేషన్‌కి కమిషనర్‌గా రాహుల్ మీనా వచ్చారు. వాళ్లు వచ్చీ రావడంతోనే క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ ప్లాస్టిక్‌పై మాత్రం ఇప్పటి వరకూ దృష్టి సారించనట్టే కనబడుతోంది. దీంతో కిందిస్థాయి ఉద్యోగులు చతికిలపడ్డారు. కానీ జరిమానాల పేరుతో వసూళ్లు మాత్రం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాస్టిక్ నిషేధంపై యుద్ధం చేసే రోజుల్లో దుకాణదారులు పాలిథీన్ చేతి కవరు ఇవ్వడానికి తలపటాయించేవాళ్లు. కానీ ఇప్పుడు మళ్లీ పాత రోజులు వచ్చేశాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎక్కడపడితే అక్కడ కనబడుతోంది. రాజమహేంద్రవరం వెంకటేశ్వర మార్కెట్‌లో వందలాది దుకాణాలు ఉన్నాయి. ఈ మార్కెట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి రాదు. దీంతో కార్పొరేషన్ అధికారులు వెళ్లినప్పుడు అక్కడి వ్యాపారులు మీ పరిధి కాదంటూ ఎదురు తిరుగుతున్నారు. కమిషనర్‌గా కేతన్ గార్గ్ ఉన్న సమయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్లను వెంట బెట్టుకొని వెళ్లి సుమారు 5 టన్నుల నిషేధిక ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఇప్పుడు మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది.

జిల్లాలో రోజుకు 50 టన్నులు

తూర్పు గోదావరి జిల్లాలో రోజుకు సగటున 200 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతు న్నాయి. వాటిలో కనీసం 50టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్(ఒకసారి వాడి పారేసేవి), పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లు ఉంటున్నాయనే విషయం డ్రెయినేజీలు చూస్తే స్పష్టమవుతుంది. ఈ తరహా వాటిపై నిషేధం ఉంది. దీని అమలులో కొరవడిన చిత్తశుద్ధి ఉన్నతాధికారుల చొరవతో కొరడా ఝుళిపించింది. మళ్లీ ఇప్పుడు చల్లారిపోయింది. దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి. అసలు అవి విక్రయించే దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. ఆయా దుకాణాలపై అధికారులు దాడులు ఎందుకు చేయరనేది ప్రశ్నార్థకమే.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ముప్పే

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగిం చడం వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల రుగ్మతల బారిన పడతారని సర్వేలు చెవిలో పోరు పెడుతూనే ఉన్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వాసు చిత్రంలో ఫణీంద్ర, తవ్వా రాజా

రాజమహేంద్రవరంలో జార్విస్ ఏవియేషన్ అకాడమీ

100 కోట్ల ప్రాజెక్టు : వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే తొలిసారిగా రాజమహేంద్రవరంలో రూ.100 కోట్లతో పైలట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జార్విస్ ఏవియేషన్ అకాడమి అధినేత ఫణీంద్ర ఆరుమిల్లి ప్రాజెక్టు వివరాలు తెలిపినప్పుడు వెంటనే ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు స్పందించి విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో జార్విస్‌తో ఒప్పందం చేసుకోగా రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఎఫ్‌టీవో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు.ఈ అకాడమీ ఏప్రిల్ నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతుందన్నారు. 40 మందితో మొదటి పైలెట్ బ్యాచ్ ప్రారంభమవు తుందన్నారు. కోన సీమ జిల్లా రాజోలుకు చెందిన ఫణీంద్ర మాట్లాడుతూ త్వరలో పైలెట్ శిక్షణకు విమానాలు వస్తున్నాయని చెప్పారు. శిక్షణకు 14 నెలలు పడుతుందన్నారు.



రూ.97 కోట్లు ఎవరివి?

- బ్యాంకుల్లో పేరుకున్న డబ్బు
- పదేళ్లుగా లావాదేవీల్లేవ్
- గుర్తించిన ఆర్‌బీఐ
- కలెక్టర్ కీర్తికి వివరాలు
- అవగాహనకు పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో క్లెయిమ్ కానీ నిధులు రూ.97 కోట్లు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మీ డబ్బు- మీ హక్కు అనే పేరుతో డిపాజిటర్ల విద్యా- జాగృతి నిధిపై సోమవారం ఆమె గోడప్రతికను ఆవిష్కరించి మాట్లాడారు. సుమారు 5.10 లక్షల వ్యక్తిగత ఖాతాలకు చెందిన సొమ్ము రూ.75 కోట్లు, 20 వేల పరిశ్రమల ఖాతాలకు చెందిన సొమ్ము రూ.18 కోట్లు, సుమారు 5 వేల ప్రభుత్వ ఖాతాలకు చెందిన సొమ్ము రూ.4 కోట్లు బ్యాంకుల్లో ఉందన్నారు. గత పదేళ్లగా దేశవ్యాప్తంగా పబ్లిక్ బ్యాంకుల్లో రూ.58, 400 కోట్లు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.8,600 కోట్లు విలువైన మొత్తాలు అన్ క్లెయిమ్డ్ ఫండ్స్‌గా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లగా ఖాతాల్లో పేరుకుపోయిన డిపా జిట్లు (అన్ క్లెయిమ్డ్) తిరిగి లబ్ధిదారులకు అందజేయడానికి ఆర్‌బీఐ యుడీజీఏఎం పోర్టల్ వినియోగంపై అవగాహన పెంచుతున్నట్టు చెప్పారు. పోర్టల్ యూడీజీఏఎం ద్వారా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.అన్ క్లెయిమ్డ్. ఓఆర్‌జీలో తెలుసుకోవచ్చన్నారు. ఖాతాదారులు, నామినీలు, కుటుంబీకులు సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఆయా బ్యాంకుల నుంచి తమ సొమ్మును అర్హులు క్లెయిమ్ చేసుకోవచ్చని లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ.ప్రసాద్ తెలిపారు. ఖాతాదారు ఉంటే కేవైసీ పూర్తి చేసి ఖాతాను పునరుద్ధరించు కోవచ్చన్నారు.నామినీ ఉంటే గుర్తింపు పత్రాలు, మరణ ధ్రువీకరణ పత్రంతో క్లెయిమ్ చేసుకోవచ్చని తెలిపారు. వివాదాలు లేకపోతే కుటుంబీకులు సరైన పత్రాలతో పొందవచ్చని చెప్పారు. ఈ కార్య క్రమంలో జేసీ వై.మేఘా స్వరూప్, డీఆర్వో టి.సీతారామమూర్తి, సీపీవో ఎల్.అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఎం.ఆర్‌ఆర్ ప్రేమ్‌కుమార్, భాగ్యలక్ష్మి, డీఎస్పీ భవ్యకిశోర్, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ఎస్ఎస్‌ఏ పీడీ ఎస్. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

30 వరకు పీఎంఏవై సర్వే

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై 2.0 పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించేందుకు జరుగుతున్న సర్వేను నవంబరు 30వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే అర్హులైన లబ్ధిదారులు తప్పనిసరిగా ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ కార్యాలయాలు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా పూర్తిచేసుకోవచ్చని తెలి పారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,429 మంది లబ్ధిదారుల నుంచి గృహ నిర్మాణాలకు అర్జీలు స్వీకరించామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సహాయ ఇంజనీర్లు అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గడువులోపు పూర్తి చేయాలని ఎంపీడీవో,హౌసింగ్, అధికారులకు సూచించారు. నివాస స్థల ధ్రువీకరణ పత్రం లేని లబ్ధిదారులకు తక్షణమే ధ్రువపత్రాలు జారీ చేయాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు.

లేడీవార్డెన్ వేధిస్తున్నారు.. రక్షణ కల్పించండి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఎస్సీ హాస్టల్ విద్యార్థుల వినతి



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ఎస్సీ కాలేజీ నెం.1 బాలుర హాస్టల్ విద్యార్థులు సోమవారం లేడీ వార్డెన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని, హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని, ఎస్సీ విద్యార్థులమైన తమకు సక్రమంగా భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరిని వేడుకున్నారు. కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో సోమవారం నాలుగు పేజీల వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని, మెనూ సక్రమంగా అందించాలని కోరినందుకు లేడీ వార్డెన్ తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, వ్యక్తిగత కక్షతో పోలీసు కేసులు పెడుతూ వేధిస్తున్నారని వాపోయారు. ఇప్పటికీ హాస్టల్‌లో మెనూ చార్టు లేదని, మెనూ అమలు కావడంలేదన్నారు. ఏఎస్‌డబ్ల్యువో, డీఎస్‌డబ్ల్యువోలు కూడా లేడీ వార్డెన్‌కు సపోర్టు చేయడంతో తమకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో కాకుండా ఆర్డీవోతో విచారణ జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కలెక్టర్‌ను అభ్యర్థించారు.

156 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో నిర్ణీత గడువులోగా సమస్యకు పరిష్కారం చూపించాలని.. అర్జీలు పెండింగ్‌లో ఉంటే ప్రజల సంతృప్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 156 అర్జీలను స్వీకరించి మాట్లాడారు.అన్ని శాఖల పనితీరులో మార్పురావాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయిపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుంద న్నారు. కార్యక్రమంలో జేసీ మేఘా స్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి పాల్గొన్నారు.

రూమ్ బుక్ చేస్తే కమీషన్ వస్తుందని..

రూ.18 లక్షలకు టోకరా

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మీరు పెట్టిన డబ్బుకు డబుల్ వస్తుందంటే ఎవరికి మాత్రం ఆశ ఉండదు. అతను అలాగే ఆశపడ్డాడు.రూ.18 లక్షలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నాడు. రాజమహేంద్రవరానికి చెందిన ఫణికుమార్ ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతని ఇన్‌స్టాగ్రామ్‌కు ఒక లింక్ వచ్చింది.ఆ లింక్‌పై క్లిక్ చేస్తే యాప్ ఓపెన్ అవుతుందని..ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులోని హోటల్ రూమ్స్ బుక్ చేస్తే పెట్టిన డబ్బుకు డబుల్ వస్తుందని వాట్సాప్ సందేశం వచ్చింది. తొలుత ఆ యాప్‌లో రూ.10 వేల రూమ్ బుక్ చేశాడు. అంతే వెంటనే అతని ఖాతాలో రూ.17 వేలు పడింది. రూ.20 వేలు రూమ్ బుక్ చేస్తే రూ. 40 వేలు పడింది. దీంతో ఫణికుమార్‌కు నమ్మకం కుదిరింది. అనంతరం రూ.లక్ష రూమ్ బుక్ చేయగా నగదు జమకాలేదు.రూమ్ బుక్ చేసుకుంటూ వెళితే ఒకేసారి సొమ్ము జమవుతుందని వాట్సాప్ సందేశం అందింది. దీంతో రూ. 18 లక్షల వరకూ బుక్ చేశాడు.అయితే తిరిగి ఒక్క రూపాయి రాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు.దీంతో సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యం కావాలి : ఎమ్మెల్యే



రామకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొవ్వూరు ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన అర్జిల్లి రామకృష్ణను ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి శాలువాను కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ రేకపల్లి మంగామణి, అర్జిల్లి చిట్టెమ్మ, కవల రామాంజనేయులు, కొప్పాక విజయ్‌కుమార్, రేగడమిల్లి నాగదుర్గ, పీఎస్ దుర్గా వరలక్ష్మి, ఏఎంసీ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, తదితరులు పాల్గొనారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పండితులు

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేష భాష గౌరవప్రదంగా ఉండాలని ఆచార్య ఇనుగంటి ఉమారామారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉమారామారావు ఆధ్వర్యంలో కవిసమ్మేళనం, పద్యాలు, కవితల పఠనం, ప్రముఖ పండితులు, యువతీ యువకులచే ప్రసంగాలు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడుతూ ప్రాథమికంగా అన్ని విషయాలు మాతృభాషలోనే నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, చామర్తి విశ్వనాథశర్మ, నక్కిన ధర్మేష్, పి.గోపాలకృష్ణ, రాయప్రోలు కామేశ్వర శర్మ, మానాశ్రీ, రవీంద్ర భారత్, ఎస్‌వీవీ మణికంట, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరురూరల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి నేపథ్యంలో పేకాట, కోడి పందేలు నిర్వహించినట్టయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ జీ.దేవకుమార్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం కొవ్వూరురూరల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, కోడి పందేలు వంటివి నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టయితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. అలాగే గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఈయనతోపాటు రూరల్ సీఐ కే.విజయ్‌బాబు, రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'ఫిర్యాదులు పరిష్కరించాలి'

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్‌లో స్వీకరించిన ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 11 ఫిర్యాదులు స్వీకరించి తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీని ప్రతీ శాఖాధికారి తమ శాఖకు చెందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు భారీగా తరలిరండి

గోపాలపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చలో విజయవాడకు మాదిగలంతా భారీగా తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు గెల్లా వెంకటశ్రీను, బొబ్బిలి వెంకటరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఉప్పరగూడెంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సభ కరపత్రాలను విడుదల చేశారు. వారిద్దరు మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

● భక్తులతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం కిటకిట ● మహిళల ప్రత్యేక పూజలు



గోష్పాదక్షేత్రంలో అభిషేకాలు చేస్తున్న పండితులు



సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందినవారు అధికసంఖ్యలో గోష్పాదక్షేత్రానికి తరలివచ్చారు. దీనిలో భాగంగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టాలలో ఉన్న శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు కార్తీకదీపాలను వెలిగించారు. సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృతఅభిషేకాలు చేశారు. పండితులకు సాలగ్రామ, దీపదానాలను సమర్పించారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల గోష్పదేశ్వరస్వామి ఆలయం, పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అలాగే వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, మద్దూరు, ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి, దొమ్మేరు, పెనకనమెట్ట, పంగిడి, పశివేదలలోని శివాలయాలు రద్దీగా కనిపించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి అన్నాభిషేకం

అలాగే సుబ్రహ్మణ్య స్నానఘట్టంలో వేంచేసియున్న అన్నపూర్ణ, విశాలక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి పంచాయతన శివాలయంలో సోమవారం అన్నాభిషేకం నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నిడదవోలు: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. కాటకూటేశ్వరంలో వేంచేసివున్న ఉమా కాటకూటేశ్వరలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం శివాలయాల్లో ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఉండ్రాజవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠంలో మైత్రేయ బుద్ధవిహార్ ఆవరణలో పీఠాధిపతి అనాలయో ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాలవారు సుమారు 100 మందికి కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 20 మందికి ఆపరేషన్లు చేసేందుకు వేమగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. 15 మందికి కళ్లజోళ్లు అందించారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు జీవన భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నంబూరి శ్రీమన్నారాయణ, ఈ.మల్లిక, పి.సత్యనారాయణ, జి.రవీంద్ర, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంప్యూటర్ రంగంపై వర్క్‌షాప్

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలోని ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల కంప్యూటర్స్ మోడల్స్‌ను చార్ట్‌లు, సెమినార్ రూపంలో ప్రదర్శించారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు బి.శ్రీనివాస్, ఎస్.భార్గవి, ఎన్.శివనారాయణ, ఎంవీవీ ఎస్.మూర్తి, డి.సతీష్‌కుమార్, శ్రీలక్ష్మి, శ్రీలత అంజనీకుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే

పెరవలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లెప్రసీ కేసుల సర్వేలో భాగంగా కానూరు, పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో 15 రోజుల పాటు ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్టు పెరవలి వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా ఏఎన్ఎం, ఆశావర్కర్, మెయిల్ వాలంటీర్ కలిసి ఒక గ్రూపుగా ప్రతి ఇంటికి వెళ్లి చర్మవ్యాధులు, శరీరంపై దీర్ఘకాలికంగా ఉన్న మచ్చ లు గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి రిఫర్ చేస్తారు. అక్కడ క్షుణ్ణంగా పరిశీలించి అది లెప్రసీ అయితే ఆరునెలల పాటు ఉచిత మందులు ఇచ్చి తగ్గించడం జరుగుతుందని, ప్రజలు ఎవరూ భయపడకుండా ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ

ఉండ్రాజవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్త నెం.2 పాఠశాల విద్యార్థులకు ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు కె. బేబీలక్ష్మి సోమవారం స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేసినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్‌వీ ప్రసాదరావు తెలిపారు. గతంలో ఆమె ఇక్కడ పని చేసి బదిలీపై ఉండ్రాజవరం వెళ్లినట్టు చెప్పారు. అలాగే ఉపాధ్యాయురాలి కుమార్తె రేష్మ ప్రణీత విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సేమియాకేసరి, గారెలు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలను వైసీపీ నిర్వీర్యం చేసింది

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం సోమవారం అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి మాట్లాడుతూ కాపవరం జంక్షన్ వద్ద ఉన్న మార్కెట్ యార్డుకు సంబంధించిన ఆరు ఎకరాల స్థలంలో ఆఫీసు కార్యాలయం, గోదాము, ప్రహరీల నిర్మాణానికి రూ. 3.23 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే నియోజకవర్గంలోని రైతులకు ఏవిధమైన సేవలు అందించవచ్చనే అంశాలపై సభ్యులతో చర్చించడం జరిగిందన్నారు. కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో కొత్తగా ఏర్పాటుచేయాల్సిన మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులపై చర్చించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2014-19 టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీల ద్వారా రైతులు పండించిన పంటల ఉత్పత్తులను పొలాల నుంచి బయటకు తరలించడానికి పుంతరోడ్లు నిర్మాణం, రైతుబజారులు ఏర్పాటుచేసి దళారులు లేకుండా రైతులే నేరుగా కూరగాయలను విక్రయించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రేకపల్లి మంగామణి, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, అర్జిల్లి చిట్టెమ్మ, కవల రామాంజనేయులు, కొప్పాక విజయ్‌కుమార్, రేగడమిల్లి నాగదుర్గ, పీఎస్.దుర్గా వరలక్ష్మి, నందిన వెంకట్రావు, మట్టే వి.వి.ప్రసాద్, ఏఎంసీ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాసరావు, చాగల్లు మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్ర ప్రసాద్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొనారు. అంతకు ముందు ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జనసేన నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావును సోమవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే ముప్పిడివెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్నిలు కలుసుకుని పరామర్శించారు.

ఘన వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన



ఉనకరమిల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రసంగిరాజు

నిడదవోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యాన్ని సంరక్షించడంలో పరిసరాల పరిశుభ్రత ప్రధాన పాత్ర పోషిస్తుందని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ గుర్రాల ప్రసంగిరాజు అన్నారు. సోమవారం ఉనకరమిల్లి, కాటకూటేశ్వరం, తిమ్మరాజుపాలెంలో ఘన వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసంగిరాజు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనెజ్మెంట్ ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత స్థానిక గ్రామ పంచాయతీలపై ఉందన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ : ఎమ్మెల్యే

గోపాలపురం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ వేదికయ్యిందన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగాన్ని తరిమికొట్టి పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తివంచన లేకుండా ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : ఎస్ఐ

దేవరపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం యర్నగూడెంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్. తిరుమలదాసు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ, లెక్చరర్ రమేశ్, గ్రంథాలయాధికారి అనిత, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రతాప్ కుమార్, కమిటీ సభ్యులు సింహాద్రి వెంకటరత్నం, పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఊనగట్ల సహకార సంఘం వారోత్సవాలు

చాగల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఊనగట్ల విశాల పరపతి సంఘంలో సోమవారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర సహకార జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి వారి సంక్షేమమే లక్ష్యంగా సహకార వ్యవస్థ ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా సంఘ సీనియర్ సభ్యులైన నల్లూరి వెంకట ధర్మరాజు, కవల బిక్కురావు, దొంగ సత్యనారాయణ, పాతాల దానయ్య, కారింకి సత్యనారాయణ, సీనియర్ డిపాజిట్ దారులైన కలగర అప్పారావు, గుండబత్తుల సుబ్బారావు, కాసాని వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యదర్శి కేతనపల్లి శ్రీనివాసరావు, సభ్యులు మిరియాల సతీష్, దొంగ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చాగల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణగూడెంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ కే. నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం కలవలపల్లికి చెందిన ఇరగవరపు ఆంజనేయులు (23) మోటారు బైక్‌పై తన సోదరి ఊరు విజ్జేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి సమయంలో బ్రాహ్మణగూడెం శివారు కలవలపల్లికి వెళ్లే రోడ్డులోని కల్యాణమండపానికి సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకి ఇంకా వివాహం కాలేదు. అతడి సోదరుడు ఇరగవరపు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పీ.విశ్వం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని క్రిస్టియన్‌పేట లూథరన్ చర్చి వెనుక నివాసముంటున్న తుంపిరి రామారావు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం ఇంటికి తాళం పెట్టి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బీరువాలో పెట్టిన రూ. 3 లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువులు దొంగిలించబడినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి రాజమహేంద్రవరం నెహ్రూనగర్ దుర్గగుడి ప్రాంతానికి చెందిన (ప్రస్తుతం కోరుకొండ బుచ్చంపేటలో నివాసం ఉంటున్న) కుందుర్తి శ్రీకాంత్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రామారావు ఇంటిలో దొంగతనం చేసిన (రూ. 2.50 లక్షల విలువైన వస్తువులు) 1 బంగారపు నల్లపూసల తాడు, 3 బంగారపు ఉంగరాలు, 4 జతల వెండి పట్టీలు, 4 వెండి ఉంగరాలు, 2వెండి బ్రాస్‌లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గతంలోనూ దొంగతనం చేసిన కేసులలో రాజమహేంద్రవరం త్రీటౌన్ ఏరియాలో 528/2025 కేసుకు సంబంధించి బంగారపు తాడు, కడియం పోలీస్టేషన్ పరిధిలోని వేమగిరిలో 288/2025 కేసుకు సంబంధించి నగదు రూ. 5,340 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ విశ్వం తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్, డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

కవులు, రచయితలను స్మరించుకుందాం

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శాఖ గ్రంథాలయ వైస్ చైర్మన్ శ్రీరామ్మూర్తి

నల్లజర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలను నేటి విద్యార్థులు స్మరించుకుని వారి ఆశయాలను అమలు చేయాలని నల్లజర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శాఖ గ్రంథాలయ వైస్ చైర్మన్ శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శ్రీశ్రీ బోధనలు, కవులు, వివిధ రచయితలు రాసిన గ్రంథాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు.ముందుగా కవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ గుదే సుశీలా, గ్రంథాలయ నిర్వాహకురాలు రమణ పాల్గొన్నారు.